నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట ,జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విశ్వభారతి స్కూల్, నాందారి టెంట్ హౌస్ ఫీడర్ల పరిధిలోని విశ్వభారతి స్కూల్, మధురానగర్, శ్రీనివాస్ కాలనీ వెస్ట్, నాందారి టెంట్ హౌస్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఇంటి ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయప్రకాష్ నగర్, గౌరీ శంకర్ నగర్ విశ్వరూప్ గల్లి, జేపీ నగర్, రాజా ఆసుపత్రి, గౌరీ శంకర్ కాలనీ, సరస్వతీ స్కూల్, ఉద్యోగ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీకే రోడ్, శాంతిబాగ్, బేగంపేట ప్లే గ్రౌండ్, ఎస్బీఐ స్టాఫ్ కాలేజ్, సీఎం క్యాంప్ ఆఫీస్ ఫీడర్ల పరిధిలోని డీకే రోడ్, మాజీ సీఎం రోశయ్య లైన్, శివ బాగ్, శాంతి బాగ్, కె.కె జోన్ హోటల్, శీష్‌మహల్ థియేటర్, బేగంపేట ప్లే గ్రౌండ్, దివ్యశక్తి లైన్, ఎస్బీఐ స్టాఫ్ కాలేజ్ ప్రధాన రహదారి, అమృత విల్లా, సీఎం పాత క్యాంప్ ఆఫీస్, ఐఏఎస్, ఐపీఎస్, మినిస్టర్స్ క్వార్టర్స్, సౌభాగ్య నగర్, ఎస్ఆర్టీ క్వార్టర్స్, కైలాష్ నగర్, సుభాష్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి అమానుషం

- ఆ పార్టీ నేత కుంబాల గంగరాజు

యూసుఫ్‌గూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని బీజేపీ కేంద్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని, వెంటనే కాంగ్రెస్ అధిష్టానం క్షమాపణ చెప్పాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కుంబాల గంగరాజు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే దుర్మార్గంగా కార్యాలయాలపై దాడి చేయడం తప్పుడు చర్య అన్నారు. ఇదేవిధంగా వ్యవహరిస్తే బీజేపీ కార్యకర్తలు ఆగ్రహంతో దాడులు మొదలు పెడితే పరిస్థితి దారుణంగా మారుతుందని, కాంగ్రెస్ నేతలు ఈ చర్య పట్ల క్షమాపణ చెప్పడంతో పాటు తమ కార్యకర్తలకు సరైన మార్గనిర్దేశం చేయాలని హితవు పలికారు.



నిరంజన్‌కు పుస్తకాలు అందజేస్తున్న మోహన్‌నాయుడు

స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ సేవలు ప్రశంసనీయం

- తానా అధ్యక్షుడు నిరంజన్

బేగంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ అన్నారు. నగరంలో పర్యటిస్తున్న నిరంజన్‌ను స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ అధినేత, ఎస్సార్‌నగర్ కమ్మ సంఘం అధ్యక్షులు సూరినేని మోహన్‌నాయుడు కలిశారు. ఈ సందర్భంగా తానా అధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా విద్యార్థులకు, గ్రంథాలయాలకు స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో లక్షల రూపాయల విలువ చేసే పుస్తకాలను మోహన్‌నాయుడు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ కమ్మ సంఘం ప్రతినిధులు ముక్కపాటి రాఘవ, రాజారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష ఎనిమిది వడలతో అలంకరణలో ఆంజనేయస్వామి

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 25లోని వ్యాపారవేత్త మేఘా కృష్ణారెడ్డి నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆంజనేయస్వామి ప్రతిమకు కృష్ణారెడ్డి సతీమణి సుధారెడ్డి ఒక లక్ష ఎనిమిది వడలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సుందరాకాండ పారాయణం పూజాదికాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 9న రాములవారి పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. స్వామివారికి సమర్పించిన వడలను నగరంలోని రామకృష్ణ మఠంతో పాటు సమీపంలోని ఆలయాలు, అయ్యప్ప భక్తులకు, ఆసుపత్రుల వద్ద పంపిణీ చేశారు.



మురళీధర్‌శర్మకు నియామకపత్రం అందజేస్తున్న ఈవో శ్రీనివాస్‌శర్మ

వెంకటేశ్వరస్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడిగా మురళీధర్ శర్మ

బంజారాహిల్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయ ముఖ్య అర్చకులుగా పనిచేస్తున్న బ్రహ్మశ్రీ వెల్లికంటి మురళీధర్ శర్మకు ఉప ప్రధాన అర్చకులుగా పదోన్నతి కల్పిస్తూ ఆలయ కార్యనిర్వహణాధికారి మొకిరాల శ్రీనివాసశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆలయంలో మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీధర్ శర్మ మాట్లడుతూ.. ఆలయంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న తనపై ఉన్నతాధికారులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భక్తులకు సేవలందిస్తానన్నారు. అయనను తోటి అర్చకులు అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బోరబండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధితో కిందపడిపోయిన వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ పోచయ్య తెలిపిన వివరాల మేరకు.. బోరబండ ఎన్ఆర్ఆర్ పురానికి చెందిన సయ్యద్ సమీల్ (42) ఈ నెల 1న మూర్ఛతో కిందపడిపోయాడు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యుటీషియన్ ఇంట్లో చోరీ

యూసుఫ్‌గూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బ్యుటీషియన్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జవహర్‌నగర్‌లో నివసించే విస్వాతి బ్యుటీషియన్‌గా పనిచేస్తుంది. ఈ నెల 5న రాత్రి తన భర్తతో కలిసి లింగంపల్లి వెళ్లి మరుసటి రోజు ఉదయం తిరిగివచ్చారు. ఇంటి తాళం తీసి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా రూ.36 వేల నగదు, చెవి రింగులు, ఫోన్ కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి పలుచోట్ల స్థలాల పరిశీలన



గురుబ్రహ్మనగర్‌లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గురుబ్రహ్మనగర్‌లో గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన 1.25 ఎకరాల స్థలాన్ని పరిరక్షిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ హుడా ఎన్‌క్లేవ్ లేఅవుట్ పార్కుల కబ్జా విషయంతో పాటు గురుబ్రహ్మనగర్ బస్తీ ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురుబ్రహ్మనగర్ బస్తీ ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. బస్తీకి ఆనుకుని ఉన్న పార్కు స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారని నందగిరి హిల్స్ హుడా ఎన్‌క్లేవ్ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ద్వారా సర్వే చేయించి విచారణ చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. బాధ్యులందరినీ పిలిపించి వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలిస్తామని చెప్పారు. గిరిజనులకు కేటాయించిన స్థలాన్ని అధీనంలోకి తీసుకున్న తర్వాత తరువాత ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు అయన పేర్కొన్నారు. కాలనీలో ఉన్న కొన్ని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరపనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ స్థలాల రక్షణ విషయంలో హైడ్రా చురుకుగా వ్యవహరిస్తుందని రంగనాథ్ వెల్లడించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. గిరిజనులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 51లో పార్కును ఆనుకొని ఉన్న ఇంటి యజమానులు 300 గజాల చొప్పున ఆక్రమించారని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, గురుబ్రహ్మనగర్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాల కులస్థులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్

పంజాగుట్ట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలతో మాదిగ సామాజిక వర్గం కన్నా మాల సామాజిక వర్గం ఎక్కువ లబ్ధి పొందిందని నిరూపిస్తే రూ.30 లక్షల రివార్డ్ ఇస్తామని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమతా సైనిక్ దళ్ దక్షిణ భారత అధ్యక్షుడు దిగంబర్.కె, వివిధ సంఘాల నాయకులు రాజేష్, డి.లక్ష్మయ్య, రాజు ఉస్తాద్, ఏ.వెంకటేష్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎస్సీ కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, సాంస్కృతిక సారథి సంస్థల్లో అమలైన పథకాలలో మాదిగల కంటే మాలలు ఎక్కువ లబ్ధి పొందినట్లు నిరూపించాలని సవాల్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీసీ నాయకులు, వివిధ సంఘాలు మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే కొంతమంది మాలలను స్మగ్లర్లు అంటూ మాట్లాడటం సరికాదన్నారు. మాలలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీ.అరుణ్‌కుమార్, రవీందర్, ఆంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీలెవల్ పార్కింగ్ భవనాన్ని పూర్తిచేస్తాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్
- ఎల్లమ్మ ఆలయం వద్ద నిలిచిపోయిన పనుల పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం పలు శాఖల అధికారులతో కలిసి ఆయన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న మల్టీలెవల్ పార్కింగ్ భవనాన్ని సందర్శించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. పనులు అసంపూర్తిగా ఉండడంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు త్వరలో ఒక సమావేశం నిర్వహిస్తానని, అందులో చర్చించి అవసరమైన చర్యలు తీసకుంటానన్నారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, అమ్మవారి దర్శనం కోసం జంట నగరాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. ఈ క్రమంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.5 కోట్లు కేటాయించాం

వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అయితే అధికారుల మధ్య సమన్వయలోపం ప్రభుత్వం మారడం వంటి కారణాలతో పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే తలసాని పేర్కొన్నారు. ఎస్ఆర్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు సైతం నిలిచిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ ఈవో కృష్ణ, ఛైర్మన్ సాయిబాబాగౌడ్, జీహెచ్‌ఎంసీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, దేవాదాయ శాఖ డీఈ శర్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న సీత

వినూత్న ఆలోచనలతో ఉజ్వల భవిష్యత్

- వి హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల

బంజారాహిల్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ వి హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కోవిడ్ తర్వాత ఫార్మసీ విద్యార్థులకు మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. చదువు పూర్తయింది కదా అని పట్టాలు పొందిన వారు ఉదాసీనంగా ఉండవద్దని, నిత్యం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడంతో పాటు అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. వి హబ్ సూతం వినూత్నంగా ఆలోచించే విద్యార్థులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నదన్నారు. అనంతరం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆమె పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, జాయింట్ సెక్రటరీ సయ్యద్ ఆమెర్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు దళితులు ఉద్యమించాలి

- ఏఐడీఆర్ఎం మహాసభల ముగింపు సభలో అజీజ్ పాషా



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా

ఖైరతాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దళితులు, ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐఆర్‌డీఎం) రెండవ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అజీజ్ పాషా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడచినా దళితులు వివక్షకు గురవుతుండడం సిగ్గుచేటన్నారు. అంటరానితనం, అత్యాచారాల నిరోధక చట్టాలు ఉన్నా, వాటి అమలు సరిగా జరగడం లేదన్నారు. ఏఐడీఆర్ఎం జాతీయ మహాసభల స్ఫూర్తితో దళితుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దళితులు, ఆదివాసీలు, బీసీలు కులాలవారీగా విడిపోవడం వల్లే అగ్రకులాల అరాచకాలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు ఎ.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ కుమార్, జాతీయ నాయకులు ఎం.బాలనర్సింహ, కె.ఏసురత్నం, మరుపాక అనిల్‌కుమార్, దేవి కుమారి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో విషాదం..

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు, కేరళ రాష్ట్ర ఆర్టీసీ యూనియన్ నాయకులు కేఆర్ బిజ్జు(52) మహాసభల ముగింపు రోజు ఆకస్మికంగా మృతిచెందారు. కార్యక్రమం కొనసాగుతుండగా కేరళ పతనంతిట్ట జిల్లా ప్రతినిధిగా హాజరైన బిజ్జు మధ్యాహ్నం 12.30 సమయంలో గుండెపోటుతో కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారని వైద్యులు చెప్పారు. దీంతో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులు ఆస్పత్రి వద్ద బిజ్జు మృతదేహానికి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకొని సభను ముగించారు. అనంతరం అంబులెన్స్‌లో మృతదేహాన్ని కేరళకు తరలించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆయన మృతిపట్ల సంతాపం తెలియజేశారు.



మృతిచెందిన బిజ్జు(ఫైల్)

ప్రేమజంట ఆత్మహత్య కారకుడిని శిక్షించాలి

- మహేష్ ఇంటి ముందు మృతదేహంతో బాలిక బంధువుల ఆందోళన



మహేష్‌యాదవ్ ఇంటి ముందు ఆందోళన చేస్తున్న లిఖిత బంధువులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంటపై వేధింపులకు పాల్పడి వారి ఆత్మహత్యకు కారణమైన యువకుడి ఇంటిముందు బాలిక లిఖిత(17) బంధువులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మక్తా గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం గాంధీ ఆస్పత్రిలో లిఖిత మృతదేహానికి పోస్టుమార్టం ముగియగానే నేరుగా మృతదేహాన్ని మహేష్ (చింటూ) యాదవ్ ఇంటి వద్దకు తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు మక్తా గ్రామానికి చేరుకొని ఆందోళనను విరమించే ప్రయత్నం చేశారు. మృతదేహానికి మహేష్ ఇంటి ముందే దహన సంస్కారాలు చేస్తామని బాలిక బంధువులు, గ్రామస్థులు భీష్మించారు. బాలిక మృతికి కారణమైన మహేష్‌ను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదలమంటూ నినాదాలు చేశారు. మృతదేహానికి మహేష్ ఇంటి ఆవరణలోనే దహన సంస్కారాలు చేసేందుకు కట్టెలు పెట్టి నిప్పంటిస్తుండటంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. సీఐ రాజువర్మ బాలిక బంధువులను సముదాయించి అక్కడి నుంచి పంపించివేశారు. పోలీసు బందోబస్తు మధ్య లిఖిత అంతిమయాత్ర పూర్తి చేశారు ప్రేమజంట ఆత్మహత్యకు కారణమైన మహేష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

చైతన్యాన్ని నింపిన శ్రీశ్రీ కవితా ప్రభంజనం

చిక్కడపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ కవితాప్రభంజనం అనేకమందిలో చైతన్యాన్ని నింపిందని ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనాచారి అన్నారు త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీశ్రీ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యాన్ని తన రచనలతో శ్రీశ్రీ మరో మలుపు తిప్పారన్నారు. సినీ పాటల్లో కూడా సామ్యవాద అభ్యుదయ భావాలు జోడించారన్నారు. వంశీ రామరాజు, మొళ్ల సీత, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, కళా జనార్దనమూర్తి తదితరులు

మహిళ హత్య

నార్సింగ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో ఓ మహిళ హత్యకు గురైంది. బతుకుదెరువు కోసం మొగలమ్మ(35) భర్త కృష్ణతో కలిసి నగరంలోని హైదర్షాకోట్‌లో నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి ఓ పరిచయస్తుడితో ఆమెకు ఘర్షణ జరిగినట్లు సమాచారం. ఈ ఘర్షణలో అతడు మొగలమ్మ మెడకు కండువా బిగించి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు నిందితుడిని గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు మంగళవారం పరిశీలించారు.

శుభాకాంక్షలు



నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నేత విశాల్ సుధాం

- బేగంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యంతో ఇబ్బందులు



బోరబండ నుంచి మాదాపూర్ వెళ్లే ప్రధాన రహదారి, , వివేకానందనగర్ తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ సామగ్రి అడ్డుగా వేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై సామగ్రి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- మోతినగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి)

హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ కుంట పునరుద్ధరణపై హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. స్థలం తనదంటూ ఎడ్ల సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను మంగళవారం న్యాయస్థానం కొట్టివేసింది. నవంబరు 13న బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. సుధాకర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఇప్పుడు పునరుద్ధరణకు అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడం పట్ల రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SIDDIPET
REVIEW APPLICATION
1 OF 2023
IN
A.S NO. 37 OF 2019

Between:
Seri Sivalaxmi ....Petitioner
And
K.S.Raju & Others ...Respondents

To
4.The Managing Director,
M/s.Nagarjuna Finance Ltd.,
Panjagutta, Hyderabad

Whereas the above named Petitioner has instituted the above Review Application against you and others. You are hereby caused Notice to appear in the court of the above in person or pleader on 21.01.2025 at 10.30 A.M to answer the same failing which the Review Application will be disposed off exparte.

(By Order of the Court)
M. Balakrishna
Advocate, Gajwel

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364


స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు, డిప్యూటీ మేయర్ శ్రీలత

రైలు పట్టాలను దాటొద్దు

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్పీఎఫ్ పోలీసుల నిబంధనలను పాటించాలని, ఎవరూ కూడా రైలు పట్టాలను దాటొద్దని గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత సూచించారు. మంగళవారం లాలాపేట్‌లో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, ఎస్సై ఎం.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లాలాపేట్ లాలాగూడ శాంతినగర్ ప్రాంతాల ప్రజలు రైలు పట్టాల వద్ద పతంగులు ఎగరవేయడం, పట్టాల వద్ద ఆడుకోవడం చేయవద్దని సూచించారు. ఆర్పీఎఫ్ నిబంధనలను పాటించకుంటే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని ఇన్‌స్పెక్టర్ సరస్వత్ హెచ్చరించారు. అనంతరం ఆర్పీఎఫ్ నిబంధనలు పాటిస్తామని, పట్టాలు దాటమని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ రజక సంఘం సభ్యులు

రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అడ్డగుట్ట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చారకొండ వెంకటస్వామి, గోపాల్, జిల్లా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రభాకర్, కేశవులు, బాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నగేష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

చిలకలగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావి బస్తీలో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ సునీత తెలిపారు. మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో ఆమెను చింతబావి బస్తీవాసులు కలిసి కలుషిత నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోగాల బారిన పడుతున్నామని, ప్రతి రోజూ నీరు కొనుగోలు చేయడం భారంగా మారిందని కార్పొరేటర్‌కు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు.

రక్త నమూనా సేకరణ సర్వేను సద్వినియోగం చేసుకోండి


ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలన వ్యూహంలో భాగంగా చేపట్టిన రక్త నమూనా సేకరణ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. మంగళవారం సీతాఫల్‌మండిలో కుట్టివెల్లోడి ఆస్పత్రిని సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మేడిబావి ఆర్యసమాజ్‌లో ఈ నెల 9,10తేదీల్లో రాత్రి ఎనిమిదిగంటల నుంచి పన్నెండు గంటల వరకు రక్తనమూనా సేకరణ జరుగుతుందని తెలిపారు. రాత్రి సమయంలోనే పరాన్నజీవులు రక్తంలో కనిపిస్తాయని, అందుకే రక్త నమూనా సర్వేను రాత్రి వేళ చేస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



మోండా డివిజన్ బండిమెట్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ కొంతం దీపిక మంగళవారం ప్రారంభించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ మనోహర్, బస్తీవాసులు పాల్గొన్నారు.
- రెజిమెంటల్‌బజార్, జనవరి 7(ఆంధ్రజ్యోతి)

బీజేపీ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. పార్టీ కార్యాలయాలపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు సీతాఫల్‌మండిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

బౌద్ధనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నామాలగుండు ఫీడర్ పరిధిలో నామాలగుండు ఆలయం, భవానీనగర్, కిందిబస్తీ, వెస్లీచర్చి, అన్నానగర్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, వారాసిగూడ ఫీడర్ పరిధిలో వారాసిగూడ, ఎస్‌బీఐ బ్యాంక్‌లేన్, టీఆర్‌టీకాలనీ, బీదలబస్తీ, భూలక్ష్మి ఆలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

బౌద్ధనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ ఎల్.నారాయణనగర్‌లో మంగళవారం ఉదయం విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో స్థానికులు, వాహనదారులు వేసిన చెత్త పేరుకుపోయింది. మంగళవారం ఉదయం ఎనిమిదన్నర గంటల సమయంలో ట్రాన్స్‌ఫారమ్ వద్ద ఉన్న చెత్తకు మంటలు అంటుకుని, ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యాపించాయి. కేబుల్స్ కాలిపోయాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.


ఎల్.నారాయణనగర్‌లో దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

మార్కెట్ యార్డులో దర్జాగా కబ్జాలు

● ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు ● బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ఇదీ పరిస్థితి


కబ్జా చేయడానికి యార్డులో వేసిన మట్టి


రాత్రి సమయంలో మట్టిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

బోయిన్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి అందులో దర్జాగా అక్రమ వ్యాపారాన్ని సాగిస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. దీంతో మార్కెట్ యార్డు ఆదాయానికి గండి పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మార్కెట్ యార్డులో లక్షలు పెట్టుబడి పెట్టి ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లు పొందినవారు మార్కెట్ యార్డులో కూరగాయల వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. కానీ, ఎలాంటి అనుమతులు, లైసెన్స్‌లు లేకుండా కొంత మంది యథేచ్ఛగా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డులో లైసెన్స్ ఉన్న కొందరు దుకాణ యజమానుల అండదండలతో పాటు మార్కెట్ యార్డు పారిశుధ్య కాంట్రాక్టుకు చెందిన ఓ సబ్ కాంట్రాక్టర్ అండదండలతో అక్రమార్కులు బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో పల రోడ్డుకు పక్కనే ఉన్న స్థలంలో పథకం ప్రకారం కూరగాయల వ్యర్థపదార్థాలు, చెత్త వేయడం ప్రారంభించారు. అనంతరం మట్టివేసిన స్థలంలో రాత్రి సమయాల్లో పారిశుధ్య కాంట్రాక్టుకు చెందిన ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టి కుప్పలను చదును చేయిస్తున్నారు. మార్కెట్ యార్డుకు ఎలాంటి రుసుమూ చెల్లించకుండా ఆ స్థలంలో అక్రమార్కులు యథేచ్ఛగా తమ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఉదయం వేళల్లో మార్కెట్‌యార్డులో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. మార్కెట్ యార్డులో లైసెన్స్ పొందాలంటే సుమారు రూ.20 లక్షల నుంచి 50 లక్షల పైమాటే. దీంతో అక్రమార్కులు మార్కెట్ యార్డులో కబ్జాలు చేస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ యార్డులో కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని పలువురు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

మార్కెట్ యార్డులో కబ్జా చేసేందుకు మట్టి పోసిన విషయం నా దృష్టికి రాలేదు. కబ్జాకు పాల్పడినవారిని, వారికి సహకరిస్తున్న వారిని ఉపేక్షించేదిలేదు. ఈ విషయమై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అలాంటి వారిని మార్కెట్ యార్డు నుంచి తొలగిస్తాం. ఈ కబ్జాల విషయంలో ఉపయోగించిన వాహనాలు పారిశుధ్య కాంట్రాక్టర్‌కు సంబంధించినవి అని తేలితే వారి కాంట్రాక్ట్ రద్దుచేసి క్రిమినల్ కేసులు పెడతాం. దీనివెనుక ఎవరు ఉన్నా ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదు.

- మార్కెట్ యార్డు సెక్రటరీ వెంకన్న

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

● మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ ● బాలల హక్కులు - పాఠశాల స్థితిగతులపై సమీక్ష


సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు, పోలీసులు

అడ్డగుట్ట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు అవగాహన కల్పించడంతో పాటు, పిల్లలు పాఠశాలకు వెళ్లేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలపై ఉందని మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్ అన్నారు. మంగళవారం అడ్డగుట్ట తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాలులో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కులు - పాఠశాల స్థితిగతులపై మండలంలోని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఓ స్వప్న మాట్లాడుతూ మారేడుపల్లి మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. తుకారాంగేట్ ఎస్సై దయాకర్ మాట్లాడుతూ తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ చేయడంతో పాటు పలు బస్తీల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. మీ ఏరియాలో గంజాయి కానీ ఇతర మాదక ద్రవ్యాలు విక్రయిస్తే నేరుగా తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎంవీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఏవీ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు మెరుగుపరిచి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. సంస్థ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అడ్డగుట్టలో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతుతండడంతో కొందరు విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారి బడికి పోవడం లేదని తెలిపారు. గంజాయి అమ్మకాలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి భరత్, తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్లు రమాదేవి, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్, సీపీఎం సికింద్రాబాద్ కార్యదర్శి ఎం.అజయ్ బాబు, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేకు సత్కారం



బొల్లారంలోని టిమ్స్ ఆస్పత్రి పనులను పరిశీలించడానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు రషీద్ ఉన్నారు.
- తిరుమలగిరి జనవరి 7(ఆంధ్రజ్యోతి)


మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు స్వామి, సభ్యులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రెజిమెంటల్‌బజార్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సొసైటీ సభ్యుడికి దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అండగా నిలిచింది. సొసైటీలో సభ్యుడిగా ఉన్న ఎస్‌కే అమిన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మంగళవారం సికింద్రాబాద్ కార్యాలయంలో అతని భార్య రుక్సానాకు రూ.5 లక్షల చెక్కును సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి అందజేశారు. సొసైటీ నుంచి ఎస్‌కే అమిన్ తీసుకున్న లోన్లు కూడా మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అంజయ్య యాదవ్, సెక్రటరీ రవిశంకర్, డెలిగేట్ సాగర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మారేడుపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ దానగౌడ్ సూచించారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి, ఎల్ శంకర్ నగర్, అల్లాడి పెంటయ్యనగర్ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ బొట్టు పెట్టి ఫ్లవర్ ఇచ్చి చెత్తాచెదారంతో ఏర్పడే అనర్థాల గురించి వివరించారు. ప్లకార్డులు పట్టుకొని పరిసర ప్రాంతాలలో తిరుగుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జవాన్లు షేక్ జాంగీర్, యతేశ్వరి, కోటయ్య, ప్రభాకర్, నర్సింగరావు, కోటయ్య, ప్రభాకర్, నర్సింగరావు, శ్రీను పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారం-1లో మంగళవారం గుర్తుతెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పాండరి తెలిపారు.

బాలుడిని మోసం చేసిన యువకుడిపై కేసు

బౌద్ధనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బాలుడికి మాయమాటలు చెప్పి బంగారం, వెండినగలు తీసుకున్న యువకుడిపై చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన నెరేళ్ల మంజుల ప్రైవేట్ టీచరు. ఆమె కుమారుడు ఎన్.వినోద్(15) స్థానికుడు శ్రీహరి(25) స్నేహితులు. దసరా పండుగ సమయంలో దుర్గామాత మండపాన్ని పెడుతున్నానని డబ్బులు ఇవ్వమని వినోద్‌ను శ్రీహరి అడిగాడు. దీంతో వినోద్ తల్లికి తెలియకుండా ఇంట్లో అల్మారాలో ఉన్న ఒక తులం బంగారం, పన్నెండు తులాల వెండి పట్టీలను తెచ్చి శ్రీహరికి ఇచ్చాడు. తల్లి అల్మారా చెక్ చేయగా బంగారం, వెండి కనిపించకపోవటంతో కుమారుడిని నిలదీసింది. దీంతో వినోద్ విషయాన్ని తల్లికి చెప్పాడు. వినోద్, మంజుల శ్రీహరి వద్దకు వెళ్లి బంగారం, వెండి విషయమై అడుగగా 'నావద్ద ఏమీ లేవు. మీ ఇష్టమొచ్చిన చోట చెప్పుకోండి' అని దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో మంజుల సోమవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగిస్తాం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

బౌద్ధనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో రూ.10కోట్ల నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. మహ్మద్‌గూడ వద్ద సివరేజీ సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహ్మద్‌గూడలో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టే సివరేజీ పైపులైన్ పనులకు, ఇందిరానగర్‌కాలనీలో రూ.18లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యాసాగర్, నవ్య, స్వర్ణలత, కౌశిక్, నాయకులు కరాటేరాజు, రాజుసుందరం తదితరులు పాల్గొన్నారు.

కుట్టివెల్లోడి ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా కుట్టివెల్లోడి ఆస్పత్రిని నిర్మిస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ఆస్పత్రి నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సుమారు పన్నెండు కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపట్టామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

బోయగూడ లైబ్రరీని అభివృద్ధి చేస్తాం

● నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్ రెడ్డి


పాఠకులతో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి, శాలిని

పద్మారావునగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): న్యూబోయగూడలోని శాఖా గ్రంథాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజతో కలిసి ఆయన మంగళవారం ఉదయం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని న్యూబోయగూడలోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదయ్యనగర్, రామ్‌గోపాల్‌పేట్, కవాడిగూడ గ్రంథాలయాలను పరిశీలించినట్లు తెలిపారు. నగరంలోని 12 గ్రంథాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని, మరో 33 గ్రంథాలయ భవనాలకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. గ్రంథాలయాల్లో అవసరమైన పర్నిచర్, కంప్యూటర్లు, వైఫై వంటి ఆధునిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. బోయగుడా శాఖ నూతన భవనం నిర్మించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. బిల్డింగ్స్ ఇన్‌చార్జి సుకేశ్‌కుమార్, బోయగూడ లైబ్రేరియన్ శాలిని, పాఠకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

బోయిన్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవడానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలించ్చారు. అయితే, కార్యాలయంలోని కంప్యూటర్లు సర్వర్ డౌన్ కావడంతో ప్రజలంతా నిరాశతో వెనుతిరిగారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వందల సంఖ్యలో ప్రజలు తమ దరఖాస్తులు తీసుకొని వచ్చారు. దరఖాస్తులు అందజేసే విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనా చెందవద్దని, కార్యాలయానికి వచ్చిన వారి దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు తెలిపారు.

పిల్లల ఎదుగుదల, వికాసానికి క్రీడలు దోహదం

ఘనంగా యంగ్ ఇండియా దివ్యాంగుల స్పోర్ట్స్ డే


యంగ్ ఇండియా దివ్యాంగుల స్పోర్ట్స్ డేను ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బోయిన్‌పల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ, బుద్ధిమాంద్య పిల్లల ఎదుగుదల, వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎన్ఐఎంహెచ్ (ఎన్ఐఈపీఐడీ) ప్రిన్సిపాల్ గణేష్ అన్నారు. ఎన్ఐఎంహెచ్(ఎన్ఐఈపీఐడీ) ఇనిస్టిట్యూట్ క్రీడామైదానంలో యంగ్ ఇండియా సంస్థ సహకారంతో దివ్యాంగుల స్పోర్ట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హాజరై ఎన్ఐఎంహెచ్ (ఎన్ఐఈపీఐడీ) ప్రిన్సిపాల్ గణేషతో కలిసి బెలూన్లు ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేష్ మాట్లాడుతూ దివ్యాంగులు ఇంటికి, హాస్టల్‌కు పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ క్రీడల్లో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 1500 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. 45 రకాల క్రీడలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతులను అందజేశారు. క్రీడలకు హాజరైన ప్రతి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి టీఏ, డీఏలను అందజేసిన యంగ్ ఇండియా సంస్థకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని దివ్యాంగులకు చెందిన పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Before the Hon'ble Deputy Registrar of Chits :: Nellore, A.P.
(Application for reference of a Dispute to Arbitration)
Dispute No.129/2023
M/s.Shriram Chits (India) Pvt.Ltd., Nellore-I Branch, Rep.by its Manager (Legal) cum GPA Holder ... Disputant
Vs
1.GVS Caterers Prop of Sagar Babu Aravbhumi and 4 others ...Opponents
Notice to 4th Opponent
Sadhya Rajan W/o. Rajan, working as Audit Manager in M/s. Sankar & Raja Chartered Accountants, Vikrampuri, Secunderabad and Residing at D.No.12-7-109/1/A, Near SMR Construction New Mettuguda Secundrabad, Hyderabad.
పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే.21-01-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 11.00 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై అభ్యంతరములు తెలుపుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వి.జయరామారావు., B.A., B.L., డిస్‌ప్యూటెంట్ తరుపు అడ్వకేట్, నెల్లూరు

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364